


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 28-09-2022 సంపుటి : 04 సంచిక : 36 పేజీలు : 4 వెల : రూ 3-00


# షింజో అబే మరణం వ్యక్తిగతంగా తీరని లోటు

**అబే అంత్యక్రియలకు హాజరన్నై ప్రధాని మోడీ**
**ప్రస్తుత ప్రధాని ఫ్యుమియో కిషిదతో భేటీ**



టోక్యో,సెప్టెంబర్27: జపాన్ మాజీ ప్రధానమంత్రి షింజో అబే మరణం విషాదకరమని.. ముఖ్యంగా తనకు వ్యక్తిగతంగా తీరని లోటని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అబే అంత్యక్రియల కోసం జపాన్‌కు వెళ్లిన మోదీ.. జపాన ప్రధాని ఫ్యూమియో కిషిదతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని షింజో అబేతో తనకు ఉన్న అనుబంధాన్ని నరేంద్ర మోదీ గుర్తు చేసుకున్నారు. గతంలో తాను జపాన్‌కు వచ్చినప్పుడు చాలా సమయం మాట్లాడకున్నామని చెప్పారు. భారత్, జపాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను అబే మరో ఎత్తుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో మైత్రి బలోపేతానికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత ప్రధాని ఫ్యుమియో కిషిద సైతం అదే తీరును కొనసాగిస్తారనే నమ్మకం తనకు ఉందని చెప్పారు..మాజీ ప్రధాని షింజో అబే అంత్యక్రియల కోసం టోక్యో వెళ్లిన నరేంద్ర మోదీ.. జపాన్? ప్రధానమంత్రి ఫ్యుమియో కిషిదతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అబే అంత్యక్రియల కోసం జపాన్‌కు వచ్చిన నరేంద్ర మోదీకి ధన్యవాదాలు కిషజద తెలిపారు. అంతకుముందు మేలో జరిగిన క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొన్న మోదీ.. కిషిదతో సమావేశమ య్యారు. జపాన్ చరిత్రలో అత్య ంత సుదీర్ఘకాలం ప్రధానిగా పని చేసిన అబే.. గత నెల హత్యకు గురయ్యారు. ఆయన నరా నగరంలోని ఓ వీధిలో లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం చేస్తుండగా ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. దీంతో అబే ఛాతీ పట్టుకుని వేదికపైనే కుప్పకూలారు. చికిత్స పొందు తూ తుదిశ్వాస విడిచారు. అంత్యక్రియలు కూడా ముగి శాయి. కానీ అక్కడి ప్రభుత్వం మంగళవారం అధికారిక వీడ్కోలు పలకాలని నిర్ణయించి ంది.

# పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ పోస్టుల భర్తీని పూర్తిచేయాలి: సీఎం జగన్

తాడేపల్లి: పశు సంవర్ధక శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పశువుల ఆస్పత్రుల్లో నాడు– నేడు, పశువులకు బీమా, ఫ్యామిలీ డాక్టర్ తరహాలో పశువులకు వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారు.స్వచ్ఛమైన పాల ఉత్పత్తికోసం అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫెస్టిసైడ్స్, రసాయనాలు ఎక్కువగా వాడుతున్నందున అవి జంతువుల్లోకి ఆహారం, వివిధ రూపాల్లో చేరి, తద్వారా పాలల్లో వాటి అవశేషాలకు దారితీస్తున్నాయని, అందుకనే స్వచ్ఛమైన పాల ఉత్పత్తిపై రైతులకు అవగాహన పెంచాలని పేర్కొన్నారు.ఆర్గానిక్ పాల ఉత్పత్తిపై దృష్టి సారించాలని సీఎం జగన్ తెలిపారు. దీని మీద సమగ్ర పద్ధతుల్లో ముందుకు వెళ్లాలన్నారు. అమూల్ ద్వారా రైతులకు మంచి అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తక్కువ పెట్టుబడి, సేంద్రీయ ఉత్పత్తుల ద్వారా స్వచ్ఛమైన పాల ఉత్పత్తి సాధించే అంశంపై పరిశోధనలు, ఆ పరిశోధనల ఫలితాలను రైతులకు అందించే చర్యలు చేపట్టాలన్నారు. అమూల్ ద్వారా పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ఆలోచన చేయాలని పేర్కొన్నారు.పాలు, గుడ్లు వాడితే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, కానీ అవే పాలలో రసాయనాల అవశేషాల కారణంగా పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందనే పరిస్థితులను చూస్తున్నామని సీఎం అన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లలు ద్వారానే మంచి భవిష్యత్తు తరాలు నిర్మాణం అవుతాయని పేర్కొన్నారు. పశు యాజమాన్యంలో ఉత్తమ పద్ధతులపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ పోస్టులను భర్తీని పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి ఆర్బీకేలో కూడా ఈ పోస్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.వైయస్సార్ చేయూత, ఆసరా ద్వారా కొనుగోలు చేసిన పశువులన్నింటికీ కూడా బీమా ఉందా? లేదా? అనేది మరోసారి పర్యవేక్షించాలి.పశువులన్నింటికీ బీమా సదుపాయం కల్పించాలి.ఆడిట్ చేసి అక్టోబరులో పథకం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.ప్రమాదవశాత్తూ, రోగాల వల్ల పశువులు చనిపోతే రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితులు వస్తాయి.ఇలాంటి సమయంలో వారికి అండగా నిలిచేందుకు ఈ పథకం తోడ్పడుతుంది.80శాతం ప్రీమియంను ప్రభుత్వమే భరిస్తుందిపశువులకు పౌష్టికాహారం అందించే విషయంలో కూడా రైతులకు తగిన అవగాహన



కల్పించాలి.సాయిల్ డాక్టర్ మాదిరిగా కేటిల్ డాక్టర్ కాన్సెప్ట్ కూడా అమలు చేయాలి.ప్రతి ఏటా కూడా క్రమం తప్పకుండా పశువుల ఆరోగ్యాలను పరిశీలించి, పరీక్షించి వాటి వివరాలను పశు ఆరోగ్య కార్డుల్లో అప్‌గ్రేడ్ చేయాలి.వెటర్నరీ ఆస్పత్రుల్లో నాడు – నేడు కింద పనులు చేపట్టాలి.ఆ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి.మండలం ఒక యూనిట్‌గా తీసుకుని ప్రతిచోటా వెటర్నరీ వైద్య సదుపాయాలు ఉండేలా సమగ్ర ప్రణాళిక అమలు చేలి.వైయస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలపై నిరంతరం సమీక్ష చేయాలి.సెకండ్ ఫేజ్ కింద అక్టోబరులో మరిన్ని పశు అంబులెన్స్‌లు ప్రారంభానికి సిద్ధంచేస్తున్నట్టు వెల్లడించిన అధికారులు.ఆర్బీకేల ద్వారా పశువులకు ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలి.ఫ్యామిలీ డాక్టర్ తరహాలోనే గ్రామాల్లోని పశువులకూ వైద్య సేవలు అందాలి.ఈమేరకు మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఆమేరకు కార్యాచరణ రూపొందించాలి. సిబ్బందిని కూడా నియమించుకోవాలివచ్చే సమావేశంలో దీనికి సంబంధించిన కార్యాచరణను నివేదించాలిగ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై దృష్టిరైతులకు ప్రత్యామ్నాయం ఆదాయాలు పశుపోషణ ద్వారా వచ్చేలా చూడాలి.పశుపోషణ విషయంలో వారికి అండగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి.దీనివల్ల వ్యవసాయంతోపాటు, పశుపోషణ ద్వారా అదనపు ఆదాయాలు లభిస్తాయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.ఆసరా, చేయూత కింద లబ్ధిదారులైన మహిళలకు పశువుల పెంపకంపై వారికి తోడుగా నిలవాలి.బ్యాంకర్లతో మాట్లాడి వారికి రుణాలు వచ్చేలా కృషిచేయాలి.ఆర్బీకేలలో, కమ్యూనిటి హైరింగ్ సెంటర్లలో పశుపోషణకు సంబంధించిన పరికరాలను అందుబాటులో ఉంచాలి.

# మూడున్నరేండ్లుగా దోపిడీ తప్పా జగన్‌కు మరో ఆలోచన లేదు: బీజేపీ నేత కన్నా



విశాఖ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మూడున్నరేండ్లుగా దోపిడీ తప్పా మరో ఆలోచనేదీ లేదని బీజేపీ సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఇసుక, లిక్కర్, గనులు సహా అన్నింటినీ జగన్ మింగేస్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖ పార్లమెంట్ జిల్లా శాఖ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.చెత్తపై కూడా పన్నులేసి దోచుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమే అని కన్నా లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. ఈయన కళ్లకు పేదలు అసలే కనిపించరని, వారి సంక్షేమం అసలే పట్టదని ఆయన అన్నారు. గతంలో ఇసుక మాఫియా చెలరేగిపోయిందని వీధివీధి తిరిగి ప్రచారం చేసిన జగన్.. అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తుందేంటో చెప్పాలన్నారు. ఇసుకలో అవినీతి జరుగుతున్నదని తెలుసుకోవడానికి సీఎంకు ఆర్నెళ్ల సమయం పట్టిందని, ఈ ఆర్నెళ్ల పాటు భవన నిర్మాణ కార్మికులు దాదాపు 50 లక్షల మంది బజారున పడ్డా పట్టించుకోలేదని చెప్పారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను గాలికొదిలేసిన జగన్.. రాజధాని ఏర్పాటు అంశంతో మూడు ముక్కలాట ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ నిరుద్యోగులను మభ్యపెడుతున్నారని, ఇప్పుడు ఉపాధి కూడా కరవైన పరిస్థితులు ఉన్నాయని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం విచ్చలవిడిగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేసిన కన్నా లక్ష్మీనారాయణ.. డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

# ఇంద్రకీలాద్రిపై రెండోరోజు బాలాత్రిపురసుందరీ దేవిగా దర్శనం



అమరావతి : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఇవాళ ఇంద్రకీలాద్రిపై బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనం ఇచ్చారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి దుర్గమ్మను దర్శిం చుకోవడానికి భక్తులు బారులు తీరారు. వృద్ధులు, దివ్యాంగులకు దర్శనానికి ప్రత్యేక సమయాన్ని ఆలయ కమిటీ కేటాయించింది. ప్రతిరోజు ఉదయం 10 నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 6 వరకు దర్శనాన్ని కేటాయించారు. అక్టోబర్ 2న మినహా ఇతర రోజుల్లో వృద్ధులు, దివ్యాంగులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనాలు : మంత్రి**

కాగా ఏపీ దేవాదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ అమ్మవారిని ఇవాళ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనాలు కల్పిస్తున్నామని చెప్పారు. నిన్న అమ్మవారిని 30వేల మంది భక్తులు దర్శించుకున్నారని వివరించారు. తొలి రోజు తలెత్తిన చిన్న చిన్న సమస్యలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకు న్నామని మంత్రి పేర్కొన్నారు. ఆన్‌లైన్ టికెట్ల విక్రయాల్లో నిన్న సాంకేతిక సమస్య లొచ్చాయని , ఆన్‌లైన్ టికెట్లను స్కాన్ చేశాక దర్శనానికి అనుమతి లభిస్తుందని అన్నారు. లడ్డు ప్రసాదాల కొరత లేదని చెప్పారు.

# రైతుల మహా పాదయాత్రకు ఇవాళ విరామం

ఏలూరు జిల్లా : అమరావతి రాజధానిగా ప్రకటించాలంటూ రైతులు చేస్తున్న మహా పాదయాత్రకు ఇవాళ విరామం ప్రకటించారు. రైతుల పాదయాత్ర గత 15 రోజులుగా కొనసాగుతున్నది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో పాదయాత్ర జరుగుతున్నది.అమరావతి రైతుల మహా పాదయాత్రకు ఒక్కరోజు విరామం ప్రకటించారు. రేపు తిరిగి పాదయాత్ర ప్రారంభమవుతుంది. 15 రోజులుగా అమరావతి రైతుల పాదయాత్ర కొనసాగుతున్నది. 16 వ రోజు కొత్తూరు నుంచి బయల్దేరి ఏలూరు, పాలెగూడె, కొప్పలి వరకు పాదయాత్ర కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. పాదయాత్రకు అడుగడుగునా ఘన స్వాగతం లభిస్తున్నది. ప్రధానంగా మహిళలు, యువత, టీడీపీ కార్యకర్తలు పాదయాత్రకు సంఘీభావం ప్రకటించి మద్ధతుగా నిలుస్తున్నారు. పాదయాత్ర ఈ నెల 12 న అమరావతి నుంచి ప్రారంభమైంది. 60 రోజుల అనంతరం అరసవిల్లిలో ముగియనున్నది.



# టీడీపీ కౌన్సిలర్‌పై వైసీపీ దాడి హేయమైన చర్య : అచ్చెన్నాయుడు



అమరావతి : తాడిపత్రిలో టీడీపీ కౌన్సిలర్ విజయ్‌కుమార్‌పై వైసీపీ శ్రేణులు దాడు చేయడాన్ని టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడితే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. రెండురోజుల క్రితం కౌన్సిలర్ మల్లికార్జునపైనా దాడి చేశారని మండిపడ్డారు. ఎస్సీలపై వైఎస్సార్ దాడులు జగన్ కానుక పథకం అమలవుతోందని తెలిపారు.తాడిపత్రిలో పెద్దారెడ్డి ఆగడాలకు అంతులేకుండా పోతోందని అన్నారు. జగన్‌ను మించిన నియంతలా పెద్దారెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ కౌన్సిలర్లపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# బాబుకు బుద్ధి లేదు.. బాలయ్యకు సిగ్గు లేదు : మంత్రి అంబటి ఘాటు ట్వీటు



తాడేపల్లి : విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరు మార్పు ఏపీ రాజకీయాలను వేడెక్కించింది. ప్రభుత్వం తీరుపై ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా.. ప్రభుత్వ పెద్దలు తామేం తక్కువ తినలేదంటూ విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి అనిల్.. బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్‌పై ఘాటు విమర్శలు చేశారు. తాజాగా మంత్రి అంబటి రాంబాబు.. చంద్రబాబు, బాలకృష్ణ, లోకేష్‌పై ఘాటు ట్వీట్ చేశారు.ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరు మార్పు అధికార, విపక్ష నేతల మధ్య మాటల యుద్ధానికి తెరలేపింది. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ట్విట్టర్ పోస్టుకు.. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు మరింత పదునుగా సమాధానమిస్తున్నారు. చంద్రబాబుకు బుద్ధి లేదు.. బాలయ్యకు సిగ్గు లేదు.. లోకేష్‌కు బుర్రే లేదు అంటూ మంత్రి అంబటి రాంబాబు తాజాగా ట్విట్టర్‌లో సెటైర్లు పేల్చారు.కష్టంలో తండ్రిపై ప్రేమ చూపని బాలయ్యా! నీకు సిగ్గులేదయ్యా! అంటూ నిన్న అంబటి మరో ట్వీట్ చేశారు.

# ఇంద్రకీలాద్రిని దర్శించుకున్న ఏపీ స్పీకర్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు ఇవాళ ఇంద్రకీలాద్రిలో అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, ఈవో భ్రమరాంబ స్పీకర్ దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం స్పీకర్ ప్రత్యేక పూజలు చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో చేసిన ప్రత్యేక ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసిం చారు. అధికారులు భక్తులకు కల్పిస్తున్న ప్రాధాన్యతను కొనియాడారు.మూడేండ్ల ఏపీ సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో పరుగులు తీస్తుందని, వర్షాలు సమృద్ధిగా పడి పాడి పంటలు బాగా వృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు.

# సంపాదకీయం

బుధవారం 28-09-2022

## రెండేళ్ల తర్వాత గుడ్ న్యూస్ కరోనా కథ కంచికి

రెండున్నరేళ్లుగా ప్రపంచాన్ని అస్తవ్యస్థం చేసిన కరోనా మహమ్మరి ఇక ముగిసిన అధ్యాయమే. ఈ విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ధృవీకరించింది. చైనాలోని వూహాన్ లో మొదలైన కోవిడ్-19 ప్రపంచాన్ని కమ్మేసింది. లక్షలాది మంది ఉసురు తీసేసింది. మరి కొన్ని కోట్ల మంది కోవిడ్ అనంతర ఇబ్బందులతో ఇప్పటికీ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో డబ్ల్యుహెచ్ఓ ప్రపంచానికి ఓ గుడ్ న్యూస్ చెప్పింది. కరోనా ఇక ఎంత మాత్రం పెండమిక్ కాదనీ, అది ఎండమిక్ స్టేజికి చేరందన్న చల్లని కబురు చెప్పింది. ప్రపంచాన్ని గజగజలాడించినన కోవిడ్-19 కథ ముగిసినట్టే అని అధికారికంగా ప్రకటించింది.'కరోనా వైరస్ వెలుగు చూసిన రెండున్నరేళ్లకు మహమ్మారి పలాయనం చిత్తగించే సమయం ఆసన్నమైందనీ, ఇక కరోనా ప్రాణాతక వైరస్ కాదని తేల్చేసింది. అంత మాత్రాన కరోనా పూర్తిగా అంతర్ధానమైపోయిందని కాదని వివరణ ఇచ్చింది. కరోనా మహమ్మారిక కారణంగా గత రెండున్నరేళ్లుగా చీకటిగుహలో మగ్గిపోతున్నాం. ఇప్పుడు ఆ మహమ్మారి ఎండమిక్ దశకు రావడంతో ఇప్పుడు ఆ చీకటి గుహ చివరిలో వెలుగు రేఖ కనిపిస్తోందని డబ్ల్యుహెచ్ఓ పేర్కొంది. అయితే.. చీకటి గుహ అవతలకు చేరుకుని వెలుగును పూర్తిగా అక్కున చేర్చుకోవడానికి మరింత సమయం పడుతుందని అంత వరకూ అప్రమత్తంగా ఉండాల్సిందేనని డబ్ల్యుహెచ్ ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ పేర్కొన్నారు. కొవిడ్ కారణంగా ఎంతో మంది మరణించారు, కరోనా నయమైనా ఇంకా అనారోగ్య సమస్యలతో చాలా మంది బాధపడుతున్నారు. ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా కూలబడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 62 కోట్లకుపైగా కరోనా కేసులు నమోదయ్యాయి . చైనాలో ఉద్భవించిన ఈ ప్రమాదకర వైరస్ కారణంగా 65 లక్షల పైగా మమరణించారు. గత కొన్ని నెలలుగా, కరోనా కేసులు తగ్గుముఖం పట్టాయి. మన దేశంలోనూ కరోనా వ్యాప్తి అదుపులోనే ఉంది. గత కొన్ని రోజులుగా స్వల్ప హెచ్చుతగ్గులతో కొత్త కేసులు 7 వేలలోపే నమోదవుతున్నాయి. కొవిడ్ ఉద్ధృతి తగ్గుతున్నా.. అసలు ఈ కరోనా మహమ్మారి ఎప్పుడు అంతం అవుతుంది? అనే ప్రశ్న అందరిలోనూ మెదులుతూ ఉంటుంది. దీనికి జవాబు తెలుసుకోవడానికి ప్రపంచం మొత్తం వేచిచూస్తుంది. ఈ ప్రశ్నకు సమాధానం మెల్లగా తెరపైకి వస్తుండటం కాస్త రిలాక్స్ అయ్యే విషయమే . కరోనా మహమ్మారి ముగింపు దశకు చేరుకుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది.కరోనా కేసులు తగ్గుతున్నాయని, ప్రపంచదేశాలు నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరోనాను అరికట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ముగింపు దశకు చేరువయ్యాయని డబ్ల్యూహెచ్ఓ చీఫ్ చెప్పారు. కొన్ని దేశాల్లో కొవిడ్ పరీక్షలు, జాగ్రత్తల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నాయని. శీతాకాలంలో మళ్లీ కేసుల సంఖ్య పెరిగి, కొత్త వేరియంట్లు పుట్టుకొస్తే ఇప్పటిదాకా సాధించిన పురోగతి వృథా అవుతుందని టెడ్రోస్ హెచ్చరించారు.కరోనా వైరస్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు చాలా వేరియంట్స్ వచ్చాయి. కరోనా వైరస్ నాలుగు రకాలను 'వేరియంట్ ఆఫ్ కన్సర్న్'గా పరిగణించింది. ఎందుకంటే ఈ వేరియంట్‌ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా కేసులు పెరిగాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఒమిక్రాన్ వేరియంట్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. భారత్‌లో దీని సబ్ వేరియంట్ ః౦.2.75 ఎక్కవగా కనిపిస్తోంది.ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.కాగా.. కరోనా వైరస్ బలహీనం అయిందని అశోకా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గౌతమ్ మీనన్ చెప్పారు. తొలి నుంచీ ప్రపంచ వ్యాప్తంగా కరోనా కేసులను గౌతమ్ మీనన్ ట్రాక్ చేస్తున్నారు. కరోనా వైరస్ కు మన శరీరాలు అలవాటు పడ్డాయని, అందువల్ల ఇక ఈ వైరస్ ఇంకెంత మాత్రం ప్రాణాంతకం కాదని ఆయన వివరించారు. కరోనా మహమ్మారికి ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు 62 కోట్ల, 2 లక్షల 42 వేల 551 మంది కరోనా బారిన పడ్డారు. కరోనా వైరస్ సోకిన 65 లక్షల 40 వేల 339 మంది మరణించారు. కాగా భారతదేశంలో ఇప్పటి వరకు 4 కోట్ల 45 లక్షల 72 వేల 243 కరోనా కేసులు నమోదయ్యాయి. 5 లక్షల 28 వేల 530 మంది కరోనా మహమ్మారికి బలైపోయారు.

# కొత్త రోడ్లకు శ్రీకారం

భీమవరం, సెప్టెంబర్ 27, చినుకు పడితే చిత్తడి. అది చిన్నదైనా పెద్దదైనా? రోడ్డంతా కొట్టుకుపోయి.. కంకర తేలి.. గుంటలుగా మారిపోతుంది. రోడ్లపై వెళ్లే వాహనదారులకి నరకయాతన. రహదారుల విధ్వంసంతో ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల నష్టం కూడా. రోడ్ల నిర్మాణంలో వినియోగిస్తున్న ముడిపదార్థాలు లభ్యత తగ్గిపోయి.. అధిక వ్యయం అవుతున్న పరిస్థితి. ఈ క్రమంలో రోడ్లను రీసైక్లింగ్ చేయడం ద్వారా వనరుల కొరతతో పాటు వాటి జీవితకాలాన్ని పెంచాలని ఏపీ సర్కార్ భావిస్తోంది.మనం ఇప్పటి వరకు తారు రోడ్లను చూసి ఉంటాం? సిమెంట్ రోడ్లను చూశాం.. కాని ఇపుడు కొత్త విధానంలో రోడ్ల నిర్మాణంఅందుబాటులోకివచ్చింది.అదే..ఫుల్‌డెప్త్ రిక్లమేషన్పెర్ఫార్మెన్స్. ఈ విధానంలో పాత రోడ్డును యంత్రాల సాయంతో రెండు నుంచి మూడు అడుగుల లోతు తవ్వకాలు జరుపుతారు. ఆ తర్వాత సిమెంట్, కెమికల్‌తో మిక్స్ చేసి చదును చేస్తారు. ఆపై ఒకదానిపై మరొక లేయర్లను నిర్మిస్తారు. దీంతో రోడ్ల మన్నిక..జీవితకాలంఎక్కువరోజులుఉంటుందట.ఏలూరు జిల్లాలో మొదటిసారిగా7.6కిలోమీటం ప్లొడవున12.12కోట్ల రూపాయల వ్యయంతో జర్మన్ టెక్నాలజీ రోడ్డు నిర్మాణం చివరదశకు చేరుకుంది. గోపాలపురం మండలం సగ్గొండ నుంచి తాళ్లపూడి మండలం గజ్జరం వరకు ఈ రోడ్ నిర్మాణం జరుగుతోంది. ఇవి సాధారణ రోడ్లు కంటే 15 నుంచి 20 ఏళ్లు చెక్కుచెదరకుండా ఉంటాయి. ఎఫ్‌డీఆర్ రోడ్ల నిర్మాణానికి భారీ యంత్ర పరికరాల అవసరం ఉంటుంది. ప్రస్తుతానికి దేశంలో ఇలాంటి బాహుబలి మెషిన్లు 60కి మించి లేవు. అతికష్టం మీద ఒకే ఒక్క యంత్రాన్ని ఇక్కడకి రప్పించారు. మ్యాన్ పవర్ తక్కువగా ఉండటంతో పాటు ఖర్చు చాలా తగ్గుతుంది. ఎఫ్‌డీఆర్ సిస్టమ్ చాలా చోట్ల సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతుందన్నారు రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్.సముద్ర తీరం ప్రాంతాల్లో రోడ్లు నిర్మించాలంటే ముడిసరుకుల రవాణాకే ఎక్కువ మొత్తం ఖర్చు చేయాల్సి ఉంటుంది. పైగా ఈ విధానంలో రోడ్లు నిర్మిస్తే పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది. రాబోయే రోజుల్లో వంద కిలోమీటర్ల మేర ఈ తరహా రోడ్లు వేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇకపై రోడ్లకు మహర్ధశ అనే చెప్పాలి. ఖర్చు తక్కువ కదా అని రోడ్డు నాణ్యత విషయంలో అధికారులు ఎక్కడా రాజీ పడటం లేదు. నల్ల రేగటి భూములు ఎక్కువగా ఉండే గోదావరి జిల్లాలు, డెల్టా ప్రాంతాలకు ఈ టెక్నాలజీ వరంగా మారబోతుంది.

# త్రిశంకు స్వర్గంలో విపక్షాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27, వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి బీజేపీని ఢీ కొట్టేందుకు బలమైన ప్రతిపక్ష కూటమిగా ఏర్పాటు కావాలని భావిస్తున్న నాన్ బీజేపీ కూటమికి ఆదిలోనే ఎదురుదెబ్బలు తప్పడం లేదు. ఈ కూటమికి కీలక నేతలు అంటి ముట్టనట్లుగా వ్యవహరించడంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర రచ్చ జరుగుతున్నది. ఆదివారం మాజీ ఉప ప్రధాని దేవీలాల్ 109 జయంతిని పురస్కరించుకుని హర్యానాలోని ఫతేహాబాద్‌లో ఐఎన్ఎల్డీ నిర్వహించిన ర్యాలీలో మరోసారి విపక్షాల ఐక్యత తేలిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ స్థాయిలో కీలకంగా అవుతారని భావిస్తున్న పశ్చిమ బెంగాల్, తెలంగాణ ముఖ్య మంత్రులు మమతా బెనర్జీ, కేసీఆర్ ఈ సమావేశానికి హాజరుకాకపోవడం చర్చనీయాశంగా మారింది. ఈ పరిణామంతో 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలన్న వ్యూహం ఏ అంచును చేరుతుందో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ మీటింగ్‌కు దేశవ్యాప్తంగా పలువురు ప్రతిపక్ష నేతలకు ఆహ్వానాలు అందాయి. ప్రతిపక్షాల ఐక్యత చాటేందుకు ఈ ర్యాలీ ఓ ముఖ్యమైన వేదికగా మారుతుందని అందరూ భావించారు. అనుకున్నట్లుగానే ఈ కార్యక్రమానికి అనేక మంది నేతలు హాజరైనా మమతా బెనర్జీ, కేసీఆర్ హాజరు కాకపోవడంపైనే అందరి దృష్టి పడినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరు నేతల వ్యవహార శైలి ఇప్పుడు ప్రతిపక్షాలను అనుమానించేలా చేస్తోందనే టాక్ వినిపిస్తోంది. ఈ మీటింగ్‌కు హాజరైన నేతలు.. కాంగ్రెస్ భాగస్వామ్యం లేకుండా ప్రతిపక్షాల ఫ్రంట్ ఏర్పాటు సాధ్యం కాదనే విషయాన్ని పదే పదే చెప్పడం హాట్ టాపిక్‌గా మారింది. అయితే, కాంగ్రెస్‌తో కలిసి పని చేయడానికి మమతా, కేసీఆర్‌కు ఇష్టం లేదని ఈ కారణం చేతనే వీళ్లు డుమ్మా కొట్టాల్సి వచ్చిందనే ప్రచారం జరుగుతోంది. ఈ మీటింగ్‌కు రాలేని వీరు భవిష్యత్‌లోనూ ఇదే వైఖరి అనుసరిస్తారనే చర్చ జరుగుతోంది.వచ్చే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతిపక్ష పార్టీలు గట్టి ప్రయత్నమే చేస్తునప్పటికీ ఆ పార్టీల వ్యవహార శైలిపై అనేక మందికి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బీజేపీపై పోరాటం విషయంలో తామంతా ఏకతాటిపై ఉన్నామనే భ్రమల్లో కొన్ని పార్టీలు కొనసాగుతున్నాయని వాస్తవానికి అలాంటి పరిస్థితులు విపక్ష కూటమిలో కనిపించడం లేదనే టాక్ ఉంది. ప్రస్తుతం తామున్న పరిస్థితియే విపక్షాల మధ్య ఐక్యత అనుకుంటే మాత్రం ఇది కచ్చితంగా త్రిశంకు స్వర్గం లాంటిదేనని, వీలైనంత త్వరగా నేల మీదకు వచ్చి వాస్తవాలను అన్వయించుకోకుంటే తప్ప బీజేపీపై ప్రతిపక్షాల పోరాటాలు నిలువలేవనే టాక్ వినిపిస్తున్నది. బీజేపీపై ఒంటికాలితో పైకి లేస్తున్న కేసీఆర్, మమతలు అసలైన సమయంలో హ్యాండిస్తున్నారనేది విపక్ష కూటమిలోని పార్టీల విమర్శలు. అయితే వీరు ఇలా చేయడం వెనుక రాజకీయంగా బలమైన కారణం కూడా ఉందనే టాక్ వినిపిస్తోంది.రాజకీయాల్లో పరిస్థితులు ఉండవని పరిణామాలే ఉంటాయనేది ఓ వాదన. అలాగే శాశ్వత శతృత్వం అనే రూల్ రాజకీయాలకు అస్సలు సూట్ కాని పదం. నిజానికి ప్రతిపక్ష కూటమిలోని పార్టీలు బీజేపీపై పోరాటం చేయక తప్పని అవసరం ఉంది. ఎందుకంటే ఆ పార్టీల విషయంలో బీజేపీ అనుసరించిన వైఖరి, లేదా ఇతర కారణాలో కమలం పార్టీపై కసితో ఉన్నాయి. తమ పార్టీ మనుగడ సాధించాలంటే బీజేపీపై పోరాటం చేయల్సిన అవసరం ఆ పార్టీలకు ఏర్పడగా టీఎంసీ, టీఆర్ఎస్ విషయంలో అలాంటి ఖచ్చితమైన ఉద్దేశం అంటూ ఏది లేదనే టాక్ వినిపిస్తోంది. కేవలం రాజకీయ అవకాశమే తప్ప మరో ఉద్దేశమేమీ లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అందువల్లే కేసీఆర్, మమతను ప్రతిపక్షాలు ఏ మేరకు విశ్వసిస్తారనేది అనుమా నమే అనే టాక్ వినిపిస్తోంది. ఈ ముఖ్యమైన ఐఎన్ఎల్డీ సమావేశానికి గైర్హాజరు కేసీఆర్, మమతలను ప్రతిపక్ష నేతలు ఇకపై కూడా విశ్వసిస్తారా లేదా అనేది కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది.

# వెంకన్న ఆస్తులు 2 లక్షల కోట్లపైనే



తిరుమల,సెప్టెంబర్27, ప్రపంచంలో వాటికన్ సిటీ తర్వాత అత్యంత సంపన్న ఆధ్యాత్మిక కేంద్రం తిరుమల తిరుపతి. నిత్యకల్యాణం పచ్చతోరణంగా భక్తుల రద్దీతో సందడిగా ఉంటుంది తిరుమల తిరుపతి క్షేత్రం. కలియుగ ప్రత్యక్షదైవం అయినవడ్డీకాసులవాడికి భక్తులు భూరి విరాళాలను సమర్పిస్తుంటారు. తాజాగా కలియుగ దైవం తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆస్తులు ఎన్ని ఉన్నాయో లెక్కతేలింది. వాటికి సంబంధించిన వివరాలను టీటీడీ వెల్లడించింది. దేశవ్యాప్తంగాశ్రీవారికి వున్న ఆస్తుల విలువ రూ.85,705 కోట్లు కాగా టీటీడీకి దేశవ్యాప్తంగా వివిధ జాతీయ బ్యాంకుల్లో రూ.14 వేల కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. 14 టన్నుల బంగారం కూడా శ్రీవారి సొంతం. శ్రీవారి ఆస్తుల విలువ మార్కెట్ విలువ కనీసం 1.5 రెట్లు ఎక్కువగా ఉంటుందని.. సుమారు రూ. 2 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేశారు.దేశవ్యాప్తంగా తిరుమల తిరుపతి దేవస్థానానికి 960 స్థిర ఆస్తులు ఉండగా, వాటి విలువ రూ.85,705 కోట్లు. స్వామివారి పేరుతో 7123 ఎకరాల భూమి ఉంది. 1974 నుంచి 2014 మధ్య కాలంలో అప్పటి ట్రస్ట్ బోర్డులు స్వామివారికి చెందిన 113 ఆస్తులను విక్రయించినట్లు టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి వెల్లడించారు. 2014 తర్వాత ఇప్పటి వరకు టీటీడీ ఎలాంటి ఆస్తులు అమ్మలేదని తెలిపారు. టీటీడీకి ఉన్న ఆస్తులు, వాటి విలువలను టీటీడి అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచినట్లు టీటీడీ ఛైర్మన్ తెలిపారు. 2018-19న కేవలం హుండీ ద్వారా రూ. 1231 కోట్ల ఆదాయం లభించింది. తిరుమలేశుడికి ఒకే నెలలో రూ.139.45 కోట్లఆదాయం2022జులైనెలలోలభించింది. ఇప్పటివరకు అత్యధిక సింగిల్ డే రికార్డు రూ.6.45 కోట్లు ఆదాయం వచ్చినట్లు సుబ్బారెడ్డి పేర్కొన్నారు

# మహిళల స్వాలంభనకు చేయూత పథకం



కాకినాడ మహిళల ఆర్థిక స్వావలంబనకు, సాధి కారతకు వైఎస్సార్ చేయూత పథకం ఉపయోగపడుతోందని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కాకినాడలో వైఎస్ఆర్ చేయూత చెక్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో వైఎస్సార్ చేయూత మూడో విడత కార్యక్రమం ద్వారా 1,02,335 మంది లబ్ధిదారులకు 191.88 కోట్ల మేర ఆర్థిక సహాయం అందుతున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా ఏడాదికి 18,750 చొప్పున క్రమం తప్పకుండా వరుసగా నాలుగేళ్లలో 75 వేలు చొప్పున అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటికే రెండు విడతల సాయం అందిందని మూడో విడత సహాయం అందించినట్లు తెలిపారు. మూడు విడతల్లో కలిపి మొత్తం జిల్లాలో లబ్ధిదారులకు 538.47 కోట్ల సహాయం అందినట్లు వివరించారు. కాకినాడ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ తండ్రి ఆశయాన్ని లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.ఎమ్మెల్యే ద్వారం పూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన వైయస్ జగన్మోహన్ రెడ్డికి మహిళలు అందరు అండగా నిలిచి ఆశీర్వాదం అందించా లని కోరారు.అనంతరం రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిం చారు. అనంతరం మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

అన్నమయ్య బి.కొత్తకోట పట్టణం పాశం వీధికి చెందిన సౌజన్య (29) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మృతురాలికి బి.కొత్తకోటకు చెందిన జితేంద్ర తో రెండు సం



, సౌజన్య ప్రస్తుతం నాలుగు నెలల గర్భవతి అని పోలీసులు తెలిసారు. సుమారు 2:30 ప్రాంతంలో ఆమె ఆత్మహత్య చేసుకుంది. బి.కొత్తకోట ఎస్సై రామ్మోహన్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపంఈకె, బతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించిరు

## జగన్ సీఎం కావడం దురదృష్టకరం

విజయవాడ సీఎం జగన్పై బీజేపీ జాతీయ కార్య వర్గ సభ్యులు కన్నా లక్ష్మీనారాయ ణ కీలక వ్యాఖ్యలు చేశారు.రాష్ట్ర సంపద ను ఏకీకృతం చేసి దోచుకున్న వ్యక్తి జగన్ అని అన్నారు.జగన్ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించాలని.. రాష్ట్రంలో ప్రజలు బతకలేని పరిస్థితి ఉందన్నారు. ప్రజలను నమ్మించి జగన్ అధికారంలోకి వచ్చారని.. ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. భారతదేశంలో అత్యంత ధనవంతుడు కావాలని జగన్ లక్ష్యమన్నారు. జగన్ సర్కారే లిక్కర్ వ్యాపారం చేయడం వలన రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని ఆయన తెలిపారు. జగన్ అరాచక పాలన నుంచి ప్రజలను రక్షించాలన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ఉంటే.. రాష్ట్రం వేగంగా అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. కడప పాలకులు... ఈ ప్రాంతానికి వస్తే ఆస్తులకు రక్షణ ఉండదన్నారు. జగన్ లాంటి వారు సీఎంగా రాష్ట్రానికి ఉండడం దురదృష్టకరమని వ్యాఖ్యలు చేశారు.

# విశాఖకు ఇన్ఫోసిస్

విశాఖపట్టణం, సెప్టెంబర్ 27, విశాఖ పై ఐటి కంపెనీలు దృష్టి సారించాయి. ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ అక్టోబర్ 1 నుంచి విశాఖపట్నం కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించబోతోంది. మధురవాడ ఐటీ సెజ్‌లోని మహతి సొల్యూషన్స్ ప్రాంగణంలో ఇన్ఫోసిస్ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమవుతోంది. తొలుత 1,000 మంది ఉద్యోగుల సామర్థ్యంతో మొదలుపెట్టి.. క్రమంగా 3 వేల మంది ఉద్యోగులకు విస్తరించనున్నట్టు ఇన్ఫోసిస్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాజెక్ట్ సమర్పించింది. మరో ప్రముఖ ఐటీ సంస్థ డల్లాస్ టెక్నాలజీస్ సెంటర్ కూడా తమ కార్యకలాపాలను విశాఖలో ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. 2.52లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మధురవాడ ఐటీ పార్క్‌లో వడి వడిగా నిర్మాణాలను చేపడుతోంది. ఈ ఏడాది చివరిలోగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు డల్లాస్ టెక్నాలజీస్ వడివడిగా అడుగేస్తోంది. అక్టోబర్ 1 నుంచి ఇన్ఫోసిస్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు ఐటి శాఖా మంత్రి గుడివాడ అమర్ నాథ్ నిర్ధారించగా, ఇన్ఫోసిస్ రాకను స్వాగతిస్తూ రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి చేసిన ట్వీట్ కు కూడా విశేష స్పందన లభించింది.పోర్ట్ సిటీలో విశాఖ లో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి ఇన్ఫోసిస్ ఏర్పాట్లు చేసుకుంటోంది. 1000 మంది తో మరొక ఐటీ కంపెనీ లో లక్ష చదరపు అడుగుల స్థలాన్ని తీసుకుని అక్టోబర్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించనున్నట్టు ఇన్ఫోసిస్ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. టాలెంట్ పూల్‌ను చేరుకోవాలనే ప్రణాళికలో భాగంగా ఇన్ఫోసిస్ కోయంబత్తూర్, వైజాగ్, కోల్‌కతా మరియు నోయిడా వంటి టైర్-ఎఎ నగరాల్లో తన కార్యాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఇండోర్ మరియు నాగ్‌పూర్‌లలో చిన్న కేంద్రాలను కలిగి ఉండగా, ఇప్పుడు వైజాగ్‌తో సహా ఈ టైర్-2 నగరాల్లో కార్యాలయాలను ప్రారంభిస్తున్నట్లు ఇన్ఫోసిస్ గ్రూప్ మానవ వనరుల అభివృద్ధి విభాగం ఇటీవల ప్రకటించింది.వైజాగ్‌లోని ఇన్ఫోసిస్ కార్యాలయం కేవలం శాటిలైట్ సెంటర్‌గా కాకుండా కనీసం 1,000 సీట్ల సామర్థ్యంతో ఉండనున్నట్టు తెలిపింది. కోవిడ్ మహమ్మారి సమయంలో వారి స్వస్థలాలకు తిరిగి వెళ్లిన ప్రతిభావంతులైన ఉద్యోగులను చేరుకోవడానికి దిగ్గజ ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ ఇలాంటి టైర్ -2 నగరాల్లో కార్యాలయాలను ప్రారంభించే ప్రణాళికలో ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని ఐటీ సెజ్ లో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి అనువైన స్థలం కోసం గత కొంతకాలంగా సెర్చ్ చేస్తోంది ఇన్ఫోసిస్. వచ్చే త్రైమాసికం చివరి నాటికి వైజాగ్ మరియు మరో మూడు కొత్త ప్రదేశాలలో కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలో తాజాగా మహతి ఐటీ పార్కు లో ఒక లక్ష చదరపు అడుగుల స్థలాన్ని తీసుకుంది.వైజాగ్‌లో కనీసం 1 మిలియన్ చదరపు అడుగుల ప్లగ్-అండ్-ప్లే స్పేస్‌ల లభ్యత ఉండడం తో ఐటి రంగ అవకాశాలు పెరగవచ్చన్న చర్చ జరిగింది కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి వృద్ధిని చూడలేదు. తాజాగా ఇన్ఫోసిస్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు వైజాగ్‌కు రావడం స్వాగతించే సంకేతం. అనేక కారణాల వల్ల వైజాగ్‌ని విడిచి వెళ్లకూడదనుకునే స్థానికప్రతిభావంతులకు ఉపాధి కల్పించడంతో పాటు స్థానిక మౌలిక సదుపాయాల వ్యవస్థను మెరుగుపరుస్తుందన్న ఆశాభావం అందరిలో ఉంది.

## హాట్ గా మారిన వెన్నుపోటు

# రాజకీయాలు

విజయవాడ, సెప్టెంబర్ 27 రాజకీయాల్లో వెన్నుపోటు అనేది సర్వ సాధారణమైపోయింది. ఒకే పార్టీలో ఒకరికొకరు వెన్నుపోటు పొడుచుకోవడం నేతలకు అలవాటు అయిపోయింది. కాకపోతే వెన్నుపోటు అంటే రాజకీయ ప్రత్యర్థులకు చంద్రబాబు పేరు మాత్రమే గుర్తొస్తుంది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని చంద్రబాబు లాక్కున్నారని ప్రత్యర్థులు ఇప్పటికీ విమర్శలు చేస్తూ ఉంటారు. అయితే ఇది ఎప్పుడో 25 ఏళ్ల క్రితం జరిగింది..అది కూడా టీడీపీని బాబు లాక్కోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. దానికి ప్రత్యర్థులు వెన్నుపోటు అని పేరు పెట్టారు.అయితే ఈ కామెంట్స్ చంద్రబాబుపై ఎప్పుడు చేస్తూనే ఉంటారు. కానీ ప్రజలు అవి పెద్ద పట్టించుకోరు.. నాయకులు మాత్రం వెన్నుపోటుని వదలరు. తాజాగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరుని వైఎస్సార్‌గా జగన్ ప్రభుత్వం మార్చింది.. దీనిపై టీడీపీ భగ్గుమంటుంది. అటు నందమూరి ఫ్యామిలీ కూడా తప్పుబట్టింది. ఇదే క్రమంలో బాలయ్య.. వైసీపీపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. దీనికి వైసీపీ కూడా కౌంటర్లు ఇస్తుంది. పేరు మార్చిన విషయం వదిలేసి.. ఎన్టీఆర్‌కు బాబు వెన్నుపోటు పొడిచారని, అందులో బాలయ్య పాత్ర ఉందని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు.ఇదే క్రమంలో వైసీపీకి కౌంటరుగా టీడీపీ కూడా విరుచుకుపడుతుంది. కాంగ్రెస్‌కు జగన్ వెన్నుపోటు పొడిచారని, అలాగే 'పేటీఎం డాగ్స్! దిస్ ఈజ్ రియల్ వెన్నుపోటు' అని నారా లోకేష్ పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఉండవల్లి అరుణ్ కుమార్ ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ క్లిప్లింగ్‌ను షేర్ చూస్తూ నారా లోకేష్ ట్వీట్ చేశారు. అందులో ఉండవల్లి అరుణ్ కుమార్ వైఎస్సార్‌ను ప్రథమ ముద్దాయిని చేసింది స్వయంగా ఆయన కుమారుడేనని తెలిపారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లి అవినీతి కేసుల్లో వైఎస్సార్ ని ముద్దాయిని చేసింది దుర్మార్గపు కొడుకు జగన్ రెడ్డి అంటూ లోకేష్ ట్వీట్ చేశారు. మొత్తానికి ఈ విధంగా రెండు పార్టీలు ప్రజా సమస్యలు వదిలేసి.. వెన్నుపోటు రాజకీయం చేస్తున్నారు.

# అలుగుల కోసం వేట..

ఏలూరు, సెప్టెంబర్ 27, అడవికి రాజు సింహం... అది ఎంతటి జీవినైనా వేటాడి నమిలేస్తుందని నమ్ముతాం... కానీ, సింహం కూడా తినలేనంత గట్టిగా ఉండే అరుదైన వన్యప్రాణులు ఉన్నాయి. అటువంటి వాటిలో అడవి అలుగు ఒకటి. అలుగు వీపుపై ఉండే పెంకులు కత్తిలాగా పదును కలిగి ఉంటాయి. ఇవి సింహం కూడా నమలలేనంత గట్టిగా ఉంటాయి. అటువంటి అరుదైన అడవి అలుగులు ఏలూరు జిల్లా పరిధిలోని పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో గల పాపికొండల అభయారణ్యంలో సంచరిస్తున్నాయి. వీటిని పాంగోలిన్ అని కూడా పిలుస్తారు.చైనీస్ పాంగోలిన్, ఏషియా పాంగోలిన్, సుండా పాంగోలిన్, పాతమాన్ పాంగోలిన్ అని నాలుగు రకాల అలుగులు ఉంటాయి. వీటి మూతి ముంగిసను పోలి ఉంటుంది. నాలుగు కాళ్లతో ఉండే ఈ అలుగు సుమారు 20 ఏళ్లు జీవిస్తుంది. చీమలు, పురుగులను ఆహారంగా తీసుకుంటుంది. ఎక్కువ శాతం దట్టమైన అడవి, అధికంగా వర్షాలు కురిసే ప్రాంతాలతోపాటు ఎడారి ప్రాంతాల్లో ఇవి జీవనం సాగిస్తుంటాయి. తొలిసారిగా 1821లో ఈ జంతువుల సంచారాన్ని గుర్తించినట్లు వైల్డ్ లైఫ్ అధికారులు తెలిపారు. అరుదైన ఈ వన్యప్రాణులు పాపికొండల అభయారణ్యం ప్రాంతంలో సుమారు 20 వరకు సంచరిస్తున్నాయని వెల్లడించారు. అలుగులు పగలు కంటే రాత్రి సమయంలోనే ఎక్కువగా సంచరిస్తుంటాయి. అలికిడి అయితే అవి బెదిరి కదలకుండా గట్టిగా బంతిలా ముడుచుకుని ఉండిపోతాయి. వీటికి ఎదురు దాడి చేసే గుణం కూడా ఉంటుంది. ఇవి రెండేళ్లకు ఒకసారి పిల్లలకు జన్మనిస్తాయి. కోతి మాదిరిగానే తన పిల్లలను వీపుపై ఎక్కించుకుని తిప్పుతూ పోషిస్తాయి. అలుగు పెంకులను చైనాలో మందుల తయారీకి ఉపయోగిస్తారని అధికారులు తెలిపారు. వీటికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, ఒక్కో అలుగు రూ.20 లక్షల వరకు ధర పలుకుతోందని చెప్పారు.

## విశాఖకు పెరిగిన పర్యాటకుల సంఖ్య

విశాఖపట్నం ప్లాస్టిక్ రహిత పరిశుభ్రమై న పర్యాటక ప్రాంతంగా విశాఖను తీర్చుదిద్దుటకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ మల్లికార్జున అన్నారు. ఉదయం వరల్డ్ టూరిజం డే 2022 సందర్భంగా విశాఖ ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ నుండి వైఎస్సార్ విగ్రహం వరకు బీచ్ వాక్ ర్యాలీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు శ్రీనివాస్ పాణీ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడు తూ విశాఖ జిల్లాకు ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల మంది పర్యా టకులు సందర్శిస్తున్నారని, కరోనా కారణంగా కొంతవరకు తగ్గుముఖం పట్టిందని అన్నారు.ఇప్పుడు పరిస్థితు లు పూర్తిగా అనుకూలంగా ఉన్నందున పర్యాటకుల సంఖ్య పెరిగిందని అన్నా రు. జిల్లాలో సుమారు 56 పర్యాటక ప్రాంతాలను విఎంఆర్డిఏ, జీవీఎంసీ, టూరిజం శాఖ సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులను ఆకర్షించేందుకు పర్యాటక ప్రాంతాలు, రోడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. ప్రజలందరూ పర్యాటకులను గౌరవించాలని అన్నా రు. పరిశుభ్రమైన ప్లాస్టిక్ రహిత టూరిజం దిశగా విశాఖలో అడుగులు వేస్తున్నామని కలెక్టర్ అన్నారు

## ప్రపంచ పర్యాటక దినోత్సవం

పోదూరు సెప్టెంబర్ 27 ( ప్రపంచ పర్యాటక దినోత్సవమును ప్రతి సంవత్సరం సెప్టెంబరు 27న జరుపుకుంటారు. 1980 నుండి ఐక్య రాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ ఈ వేడుకలను సెప్టెంబరు 27 న నిర్వహిస్తుంది. ఈ తేదీని 1970 లో ఒక రోజున ఎంపికచేశారు. యు.యన్.డబ్ల్యు. టి.ఓ విధానాలననుసరించి ఈ రోజును స్వీకరించడం జరిగింది.ఈ విధానాన్ని అవలంబించడాన్ని ప్రపంచ పర్యాటకంలో ఒక మైలురాయిగా భావిస్తారు.ఈ రోజు యొక్క ఉద్దేశ్యం అంతర్జాతీయ సమాజంలో పర్యాటక పాత్ర మీద అవగాహన పెంచడం మరియు అది ప్రపంచవ్యాప్తంగా సామాజిక, సాంస్కృతిక,రాజకీయ,ఆర్థిక విలువలను ఎలా ప్రభావితం చేసిందో చూపటం. ప్రపంచ పర్యాటక దినోత్సవం జరపాలని నిర్ణయించిన ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారని మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాల ఉపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్య కుమార్ అన్నారు.1991వ సంవత్సరంని టూరిజం సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా భారత ప్రభుత్వం 1991లో విడుదల చేసిన ఒక రూపాయి నాణెముని ఈ సందర్భంగా సూర్య కుమార్ మంగళవారం విలేకరులకు ప్రదర్శించి చూపారు.

# తెలుగు దేశం పార్టీలో చిచ్చుకు కుట్ర

విజయవాడ, సెప్టెంబర్ 27, ఎన్టీఅర్ కుటుంబంలో తెలుగు దేశం పార్టీలో చిచ్చుకు పెట్టే మరో కుట్రకు తెర తీస్తున్నారు. చిత్రం ఏమిటంటే, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మొదలు, ఈ వంకర ట్వీట్లు చేసిన మహిళ మంత్రుల వరకూ ప్రతి ఒక్కరూ ఎన్.టి.ఆర్. హెల్త్ యూనివర్శిటీ పేరు ఎందుకు మార్చారో, చెప్పకుండా, తమ తప్పుడు నిర్ణయాన్ని ప్రశ్నించే అర్హత తెలుగు దేశం పార్టీకి, చంద్రబాబు నాయుడికి లేదనే వితండ వాదాన్ని తెర మీదకు తెస్తున్నారు. ఎన్.టి.ఆర్. హెల్త్ యూనివర్శిటీ పేరు ఎందుకు మార్చారు? అనే ప్రశ్నకు ఏమాత్రం సంబంధం లేని గతాన్ని తీసుకొచ్చి, మోకాలుకు బోడి గుండుకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.నిజానికి ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు, తెలుగు దేశం నాయకులే కాదు రాష్ట్ర ప్రజలు అందరూ ముక్త కంఠంతో ఒకటే ప్రశ్న అడుఉగుతున్నారు. 'ఎన్.టి.ఆర్. హెల్త్ యూనివర్శిటీ పేరు ఎందుకు మార్చారు?' అని. అలాగే తప్పు చేస్తున్నావని హెచ్చరిస్తున్నారు. రాజకీయ లబ్దికోసం రాష్ట్రంలో చిచ్చు పెట్టవద్దని అంటున్నారు. కానీ, జగన్ రెడ్డికి, ఆయనకు ఫ్లూటు ఊదుతున్న మహిళా మంత్రులు, ఇతర నేతలు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా, ఎప్పుడో దశాబ్దాల క్రితం తెలుగు దేశం పార్టీలో ఏర్పడిన అంతర్గత సంక్షోభానికి, 'వెన్నుపోటు' అనే పేరు తగిల్చి, ఆ వంక తమ ప్రభుత్వం తీసుకున్న అరాచక రాజకీయ నిర్ణయాన్ని సమర్ధించుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి అప్పుడేమి జరిగిందో, ఎందుకు తెలుగు దేశం పార్టీలో సంక్షోభం ఏర్పడిందో, అందరికీ తెలిసిన విషయమే. ఆ నాడు, తెలుగుదేశంలో సంక్షోభానికి మూల కారణం, లక్ష్మీ పార్వతి. ఆమె దుష్ట సంకల్పంతో ఎన్టీఆర్ జీవితంలోకి ప్రవేశించి పెట్టిన చిచ్చు కారణంగానే తెలుగు దేశం పార్టీలో సంక్షోభం ఏర్పడింది. ఎన్టీఆర్ ను మోసం చేసి వివాహం అనే ముసుగులో ఆయన జీవితంలో ప్రవేశించారు. భార్యగా నటించారు. అప్పుడే కాదు, ఇప్పుడు కుడా ఆమె నైజం మారలేదు.నిజంగా ఆమె మనసా,వాచా,కర్మణ ఎన్టీఅర్ ను భర్తగా భావించి ఉంటే, గౌరవించి ఉంటే, ఎన్టీఆర్ కు ఇంత అవమానం జరిగిన మరు క్షణం ఆమె తన పదవికి రాజీనామా చేయవలసింది. కానీ, ఇన్ని రోజులైనా, ఇంత చర్చ జరుగుతున్నా ఆమె మౌనంగా ఉన్నారు. ఎన్టీఆర్ ను అవమానించిన ప్రభుత్వం ఇచ్చిన పదవిలో కొనసాగుతున్నారు. అంటే ఆమె ఎన్టీఅర్ జీవితంలో ఎందుకు ప్రవేశించారో , ఏమి చేశారో, రాజ్యాంగేతర శక్తిగా ఆమె ఎలా ప్రవర్తిచారో వేరే చెప్పనక్కరలేదు.ఇంకా చిత్రం ఏమంటే, నిన్న మొన్నటి వరకు తెలుగుదేశం పార్టీలో వుండి, అప్పట్లో వైసీపీని, జగన్ మోహన్ రెడ్డిని, చివరకు, చేతులు జాడించి జగన్ రెడ్డి, 'ఆ దివంగత నేత, మహా నాయకుడు' అని గొప్పగా చెప్పుకునే వైఎస్సార్ ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిపోసిన, ఈ మహిళా మణులే ఇప్పుడు చంద్రబాబు గురించి వెన్నుపోటు థియరీలు మాట్లాడుతున్నారు. జగన్ రెడ్డిని జ'గన్'రీల్ సింహం కాదు, రియల్ సింహం' అంటూ ఎత్తేస్తున్నారు. వారేవా, ఎంతటి జాణతనం, అని జనం విస్తు పోతున్నారు. అదొకటి అలా ఉంటే, ఎప్పుడో దశాబ్దాల క్రితం జరిగిన సంఘటనను చిలువలు పలవలుగా చిత్రించి అసలు సమస్యను పక్క దారి పట్టించే జగన్ రెడ్డి, తనను కష్ట కాలంలో, జైలులో ఉన్న సమయంలో, జగనన్న వదిలిన బాణం అంటూ, సుదీర్ఘ పాద యాత్ర చేసి పార్టీని బతికించిన సోదరి షర్మిలకు ఇచ్చిన కానుకను ఏమంటారు?పార్టీని నిలబెట్టిన తన స్వంత తల్లీ, చెల్లిని పార్టీ నుంచి మెడ పట్టి బయటకు గెంటడాన్ని, ఏమంటారు? ఏ పోటంటారు? జగన్ రెడ్డి అయన్ను భట్రాజు పొగడ్తలతో ముంచెత్తుతున్న,మహిళా నేతలు సమాధానం చెప్పవలసి ఉంటుంది. కానీ, వారు సమాధానం చెప్పరు. చెప్పలేరు, కానీ ప్రజలు మాత్రం సరైన సమయంలో సరైన సమాధానం ఇస్తారు. నో డౌట్.

# ఇక భూములకు క్యూ ఆర్ కోడ్

నెల్లూరు, సెప్టెంబర్ 27, బ్రిటీష్ కాలం నాటి రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేసి వివాదాలకు శాశ్వతంగా తెరదించే లక్ష్యంతో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు? భూరక్ష పథకం ద్వారా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని శరవేగంగా చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ ముద్రించనుంది. దీన్ని స్కాన్ చేయడం ద్వారా భూ కమతం, విస్తీర్ణం, ఎలాంటి భూమి, మ్యాప్ తదితర వివరాలన్నీ తెలుసుకోవచ్చు. రీ సర్వేలో అక్షాంశాలు, రేఖాంశాలతో (జియో కో?ఆర్డినేట్స్) భూమి హద్దులను నిర్ధారిస్తున్నారు.భూమికి నలువైపులా వీటిని సూచించడం ద్వారా విస్తీర్ణాన్ని కచ్చితంగా తెలుసుకోవచ్చు. వీటి ఆధారంగా రైతుల పట్టాదార్ పాస్ పుస్తకంలో క్యూఆర్ కోడ్ ముద్రిస్తారు. ప్రస్తుతం ఒక సర్వే నంబర్‌కి ఒక ఎఫ్ఎంబీ ఉండగా, నలుగురైదుగురు భూ యజమానులుంటే ఉమ్మడిగా ఒక మ్యాప్ కేటాయిస్తున్నారు.రీ సర్వే తర్వాత ప్రతి భూమిని (సెంటు భూమి విడిగా ఉన్నా సరే) సర్వే చేసి ప్రత్యేకంగా రాళ్లు పాతుతారు. దానికి ల్యాండ్ పార్సిల్ మ్యాప్ ఇస్తారు. ఆ సర్వే నంబర్‌లో ఎంత మంది ఉంటే అందరి మ్యాప్‌లు విడివిడిగా పొందుపరుస్తారు. ప్రతి భూ యజమానికి తమ భూములపై ఎవరూ సవాల్ చేయడానికి వీలు లేని శాశ్వత హక్కులు లభిస్తాయి. జీపీఎస్ కార్స్ నెట్‌వర్క్ (కంటిన్యూస్లీ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్ నెట్‌వర్క్) ద్వారా భూములను కొలుస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 70 బేస్ స్టేషన్లు శాటిలైట్ రేడియో సిగ్నళ్లను స్వీకరించి కచ్చితమైన అక్షాంశ, రేఖాంశాలను సెంట్రల్ కంట్రోల్ స్టేషన్‌కు పంపుతాయి. కార్స్, డ్రోన్, రోవర్ సహాయంతో భూములను కచ్చితంగా కొలుస్తారు. తద్వారా ప్రతి స్థిరాస్తి కొల తలు, హద్దులు, విస్తీర్ణం, భూ కమత పటం ల్యాండ్ రిజిస్టర్‌లో డిజిటల్ రూపంలో నమోదవుతాయి. వీటితో మ్యాప్‌లో క్యూఆర్ కోడ్ రూపంలో పొందుపరుస్తారు.ప్రతి భూమికి (ల్యాండ్ పార్సిల్) ఒక విశిష్ట సంఖ్య కేటాయించి భూమి వివరాలతోపాటు భూ యజమాని ఆధార్, మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ సేకరించి భూ రికార్డులో భద్రపరుస్తారు. భూ యజమానికి తెలియకుండా రికార్డుల్లో ఎలాంటి మార్పులు చేయడానికి అవకాశం ఉండదు. డూప్లికేట్ రికార్డులు, ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదు.ఆయా భూముల క్రయ విక్రయాలు జరిగిన వెంటనే రికార్డుల్లో ఆటోమేటిక్‌గా మారిపోతాయి. తద్వారా భూ సమాచారాన్ని ఎవరైనా, ఎప్పుడైనా ఎక్కడి నుంచైనా తెలుసుకోవచ్చు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం కంప్యూటర్ ఆధారిత భూ సమాచార వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. దీనిద్వారా ఎవరైనా తమ భూమిని మ్యాప్‌తో సహా చూసుకోవడానికి వీలుంటుంది. ప్రతి ఆస్థికి యజమాని గుర్తింపు రికార్డుల్లో పదిలంగా ఆస్తి హక్కులు ఆ ఆస్తిని మరొకరు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు పకడ్బందీగా హద్దులు, కొలతలు క్షేత్రస్థాయిలో భూమి ఏ ఆకారంలో ఉందో రికార్డుల్లో అలాగే ఉంటుందిఎప్పుడైనా, నుంచైనా ఆస్తి వివరాలు తెలుసుకోవచ్చు హద్దు రాళ్లు తొలగించినా, గట్టు తెగ్గొట్టినా మీ ఆస్తి డిజిటల్ రికార్డుల్లో భద్రంగా ఉంటుంది. భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం, సంపూర్ణ హక్కుతో ఉంటుంది.

# దసరాకు కేసీఆర్ ప్రకటన



హైదరాబాద్, సెప్టెంబర్ 27, బీజేపీకి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ అజెండా దిశగా అడుగులు వేస్తున్న తెలంగాణ సీఎం కేసీఆర్.. జాతీయ స్థాయిలో కొత్త పార్టీతోపాటు కొత్త కూటమి ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. 2024 లోక్ సభ ఎన్నికలే లక్ష్యంగా వడివడిగా వ్యూహ రచన చేస్తున్నారు. ఇప్పటికే పలు రాజకీయ పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపిన కేసీఆర్.. ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ అంశంపై కొంతకాలంగా కసరత్తు చేస్తున్నారు కూడా. నేషనల్ పాలిటిక్స్‌లో క్రియాశీలక పాత్ర పోషించాలనే తన ఆలోచనను వివిధ వేదికలపై బయట పెట్టారు తెలంగాణ సీఎం. ఈ విషయం తెలిసినప్పటి నుంచీ కొత్త జాతీయ పార్టీపై పలుపేర్లు ప్రచారంలోకి వచ్చాయి.సీఎం కేసీఆర్ స్వయంగా వివిధ రాష్ట్రాలకు వెళ్లి అక్కడి ముఖ్యమంత్రులతో సమావేశం అయ్యారు. వివిధ పార్టీల నేతలతో కీలక చర్చలు జరిపారు. ఇదే సమయంలో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌కు వచ్చిన వివిధ పక్షాల నాయకులతో మంత్రంగాలు నడిచాయి. గులాబీ దళపతి ఆలోచనలకు మద్దతు తెలిపారు నాయకులు. అయితే జాతీయ పార్టీ ప్రకటన అప్పుడు.. ఇప్పుడు అంటూ గతంలో గుసగుసలు వినిపించాయి. కానీ.. ప్రస్తుతం గట్టి ముహూర్తం ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. ఈ దసరాకు సీఎం కేసీఆర్ కీలక ప్రకటన చేస్తారని సమాచారం. అక్టోబర్ ఐదున కొత్త పార్టీ పేరు ప్రకటనతోపాటు.. ప్రత్యామ్నాయ అజెండాను వెల్లడిస్తారని తెలుస్తోంది.జాతీయ పార్టీ జెండా.. అజెండాల విషయంలో సీఎం కేసీఆర్ ఒక ఆలోచనకు వచ్చారట. ఆ కసరత్తు కూడా కొలిక్కి వచ్చినట్టు సమాచారం. పైగా సెంటిమెంట్‌గా విజయదశమి రోజు అయితే అంతా సక్సెస్ అవుతుందని అభిప్రాయ పడుతున్నారట. టీఆర్ఎస్ వర్గాలు కూడా ఇదే మూడ్‌లో ఉండటంతో అక్టోబర్ 5ను ఫిక్స్ చేసినట్టు చెబుతున్నారు. అయితే జాతీయ పార్టీ ప్రకటన కంటే ముందు రాష్ట్రంలో చేయాల్సిన కసరత్తుపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టారట. ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువగా పర్యటించాల్సి రావొచ్చు. అందుకు షెడ్యూల్ సిద్ధం చేస్తున్నారట. ఈ విషయంలో కలిసి వచ్చే పార్టీలు.. ఆ పక్షాలు బలంగా ఉన్న రాష్ట్రాలను వదిలిపెట్టి.. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో కేసీఆర్ టూర్ చేస్తారని తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగానే ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయట.జాతీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఫిక్స్ కావడంతో గులాబీ వర్గాల్లో ఉత్కంఠ పెరిగిపోతోంది. అందరి దృష్టి అక్టోబర్ 5పై నెలకొంది. పార్టీ పేరు ఏంటి? జెండా ఏ రంగులో ఉంటుంది? అజెండాలోని అంశాలపైనా ఎవరికి వారు విశ్లేషణలు చేస్తున్నారు. మరి.. సీఎం కేసీఆర్ ఎలాంటి సంచలన ప్రకటన చేస్తారో అప్పటి వరకు వేచి చూడాల్సిందే.

# ఇంకా ఆగని పేరు మార్పు రచ్చ




విజయవాడ, సెప్టెంబర్ 27, ఏపీ రాజకీయాల్లో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పుపై పెద్ద ఎత్తున టీడీపీ నిరసనలు చేస్తున్న విషయం తెలిసిందే. దాదాపు 25 ఏళ్ల నుంచి ఉంటున్న ఎన్టీఆర్ పేరుని తీసి..వైఎస్సార్ యూనివర్సిటీని జగన్ ప్రభుత్వం జీవో తీసుకొచ్చింది. అసలు ఈ యూనివర్సిటీతో వైఎస్సార్‌కు సంబంధం లేదు. కానీ వైఎస్సార్ డాక్టర్ అని..అందుకే ఎన్టీఆర్ పేరు తీసి వైఎస్సార్ పేరు పెట్టమని చెబుతున్నారు. అయితే.. ఎన్టీఆర్ యూనివర్సిటీ పేరు మార్పు రగడ ఏపీలో ఇంకా రగులుతూనే ఉంది.ప్రెస్ మీట్లు.. ట్విట్టర్ వేదికగా జరిగిన మాటల యుద్ధం దాటి.. పోస్టర్ల స్థాయికి వెళ్లింది వ్యవహారం. ఎన్టీఆర్ గురించి గతంలో చంద్రబాబు చేసిన కామెంట్లకు సంబంధించిన పత్రికల క్లిప్పింగులను పోస్టర్లుగా వేశారు వైసీపీ కార్యకర్తలు. ఇటీవలే వైసీపీ విడుదల చేసిన పత్రికల క్లిప్పింగులను పోస్టర్లుగా వేశారు వైసీపీ కార్యకర్తలు. విజయవాడలోని వివిధ ప్రాంతాల్లో వెలిశాయి పోస్టర్లు. పోస్టర్లు వేసిన వారిపై చర్యలు కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయనుంది టీడీపీ.మరో వైపు నాలుగు రోజులుగా జూనియర్ ఎన్టీఆర్ మీద చేస్తున్న అసభ్యకర ట్రోల్స్ ను ఖండిస్తున్నామని అన్నారు ఎన్టీఆర్ కృష్ణ జిల్లా అభిమాన సంఘం నాయకులు కావూరి కృష్ణ, నున్న గణేష్. ఈ సందర్భంగా వారు ఓ ప్రకటన విడుదల చేశారు. '' గత 4 రోజులుగా జూనియర్ ఎన్టీఆర్ గారి మీద చేస్తున్న అసభ్యకర ట్రోల్స్ ను ఖండిస్తున్నాము.అక్రమంగా నడుపుతున్న తెలుగుదేశం పార్టీ వారికి తెలియజేయడం ఏమనగా మీరు కావాలి అనుకున్నప్పుడు జూనియర్ ఎన్టీఆర్ రావాలి. వద్దు అంటే సైలెంట్ గా ఉండాలా.. తెలుగుదేశం పార్టీకి జూనియర్ ఎన్టీఆర్ మాత్రమే వారసుడు. మీరు ప్రస్తుతానికి అక్రమంగా నడుపుకుంటున్నారు, నడుపుకోండి అంతేగాని జూనియర్ గురించి ఒక్క మాట మాట్లాడిన, ఒక్క ట్రోల్ వేసినా ఊరుకోము.మీ చరిత్ర మీరు ఆ మహా నాయకుడు ఎన్టీఆర్ గారి మీద ఎలాంటి కుట్రలు చేశారో తెలియాలని నిన్నటి నుండి ఎన్టీఆర్ జిల్లాలో ప్రతి కాంపౌండ్ గోడకు ఎన్టీఆర్ గారి గురించి నీచంగా మాట్లాడిన చంద్రబాబు న్యూస్ పేపర్లు అంటిస్తున్నాము. ఇందులో ఏ పార్టీకి సంబంధం లేదు. కేవలం జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల బాధాతప్త హృదయంతోనే చంద్రబాబు నాయుడు నీచ చరిత్ర ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతోనే చేస్తున్నాము". అని ప్రకటన విడుదల చేశారు.

# రాజధానిపై రెఫరండం... వైసీపీ స్కెచ్

గుంటూరు, సెప్టెంబర్ 27, ఏపీలో రాజధాని అంశంలో రచ్చ నడుస్తూనే ఉంది..ఎప్పుడైతే అమరావతిని కాదని జగన్..మూడు రాజధానులు అని ప్రకటించారో అప్పటినుంచి రాజధానిపై రచ్చ జరుగుతూనే ఉంది. ఓ వైపు అమరావతిని రాజధానిగా ఉంచాలని, ఆ ప్రాంత రైతులు, టీడీపీ, ఇతర పార్టీలు పోరాడుతున్నాయి. ఇటు వైసీపీ మాత్రం మూడు రాజధానులు అంటుంది. సరిగా మూడు రాజధానుల బిల్లు రూపొందించకపోవడం, న్యాయ పరమైన చిక్కులతో కోర్టులో మూడు రాజధానుల బిల్లు నిలవలేదు.ఇదిలా ఉండగానే అమరావతి కోసం ఆ ప్రాంత రైతులు, ప్రజలు శ్రీకాకుళంలోని అరసవెల్లి వరకు పాదయాత్ర మొదలుపెట్టారు. ప్రస్తుతం యాత్ర కృష్ణా జిల్లాలో కొనసాగుతుంది. అయితే ఎప్పుడైతే విశాఖలోకి పాదయాత్ర వస్తుందో..అప్పుడు ఖచ్చితంగా అడ్డుకుని తీరుతామని వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు వార్నింగ్ ఇస్తున్నారు. విశాఖలో గొడవలు చేయడానికి వస్తున్నారని మాట్లాడుతున్నారు. అసలు అమరావతి రైతులు ఏమో?వారి దారిలో వారు యాత్ర చేసుకుంటూ వెళుతున్నారు. కానీ గొడవ కోసం ఎవరూ చూస్తున్నారనేది దీని బట్టి అర్ధమవుతుంది.ఇక ఉత్తరాంధ్రలో వైసీపీ నేతలు..ఇతర ప్రజా సంఘాలు, విద్యార్థులుతో కలిసి ఓ జేఏసిని ఏర్పాటు చేసుకున్నారు. కాకపోతే ఈ జేఏసి పూర్తిగా వైసీపీదే అందులో డౌట్ లేదు. ఇక వీరి పని విశాఖ రాజధాని కోసం పోరాటం అంటున్నారు. అలాగే అమరావతి వాళ్ళని అడ్డుకుంటామని చెబుతున్నారు. కానీ ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే..విశాఖకు రాజధాని రావాలనే అంశంలో వైసీపీ నేతలు చేస్తున్నంత హడావిడి..అక్కడి ప్రజల్లో కనిపించడం లేదు.వారు మాత్రం ఏదొకటి ముందు ఒక రాజధాని ఉంటే చాలు అని భావిస్తున్నారు..విశాఖకు రాజధాని వస్తే మంచిదే అని కూడా అనుకుంటున్నారు. కానీ వైసీపీ చెప్పి మూడేళ్లు అయిన రాజధాని లేదు. పైగా కోర్టులో ఎదురుదెబ్బలు..దీంతో రాజధాని ఇప్పటిలో అయ్యే పని కాదని



అక్కడి ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. పైగా ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉంది..మరి తర్వాత వేరే పార్టీ అధికారంలోకి వస్తే పరిస్తితి ఏంటి అనేది డౌటే. పైగా ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా ఉంది..అలాంటప్పుడు వైసీపీ చేసే ఈ పోరాటం ఎంతవరకు సక్సెస్ అవుతుంది..అమరావతి వాళ్ళని ఎంతవరకు నిలువరించగలుగుతారు అనేది చూడాలి.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం లక్ష్యం



సుండుపల్లి మండలం సెప్టెంబర్ 27సుండుపల్లి మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని కడప జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జున రెడ్డిలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుండుపల్లె మండలానికి తొంభై కోట్ల రూపాయలు,రాజంపేట నియోజకవర్గానికి తొమ్మిది వందల కోట్ల రూపాయలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందుతారని అన్నారు. యర్రపు రెడ్డి ఆదినారాయణరెడ్డి జలాశయం పింఛా ప్రాజెక్ట్ తో పాటు అన్నమయ్య ప్రాజెక్టుల పునర్ నిర్మాణ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లామని త్వరతగతిన పూర్తి చేసి మండల రైతాంగాన్ని ఆదుకుంటామని అన్నారు.పాదయాత్రలో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలలో భాగంగా మహిళలకు వై.ఎస్.ఆర్ చేయూత పథకం ద్వారా లబ్ధిపొందుతున్న మహిళలకు మంగళవారం సుండుపల్లె మండలంలోని ఎం సి ఆర్ కళ్యాణ మండపంలో డ్వాక్రా మహిళలకు నాలుగు కోట్ల ఎనభై నాలుగు లక్షల అరవై ఎనిమిది వేల ఏడు వందల యాభై రూపాయల చెక్కును అందచేసారు ప్రతిపక్షాలు సంఖ్యలో మాట్లాడుతూ కాపు నిందలు వేస్తున్నారని ప్రజలకు నాయకులు అధికారులతో పనిలేకుండా బటన్ నొక్కితే వారివారి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని గుర్తు చేశారు మరో ఇరవై సంవత్సరాల పాటు జగనన్న సీఎంగా ఉంటేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని మనమంతా అభివృద్ధి చెందుతామని ఉద్ఘాటించారు రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యం పైన ప్రత్యేక దృష్టి పెట్టిందని భావితరాల ఆస్తి విద్యా ఒక్కటేనని పేర్కొన్నారు ఈరోజు హాస్టళ్ల విద్యార్థులకు ఫైవ్ స్టార్ హోటల్ మెనూను ఇచ్చారని గతంలో ఏ ప్రభుత్వాలు చేయనన్ని సంక్షేమ పథకాలు నాడు నేడు అమ్మఒడి విద్యాదీవెన వంటి పథకాల ద్వారా విద్యార్థులు ఉన్నత చదువులు చదివి డాక్టర్లు ఇంజనీర్లుగా ఎంతోమంది ప్రతిభావంతులు తయారవుతున్నారని పేర్కొన్నారు గతంలో ప్రియతమ నాయకులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి మైనార్టీలకు నాలుగుశాతం రిజర్వేషన్ ఇచ్చి ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యా ప్రదాత అయ్యాడని అలాగే మహిళలకు పావలా వడ్డీ రుణాలు,ఆరోగ్యశ్రీ వంటి ఎన్నో కొత్త పథకాలు పెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తండ్రి ఒకడుగు వేస్తే తనయుడు రెండడుగులు చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు రానున్న కాలంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి మనమందరం అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో మేడా విజయ శేఖర్ రెడ్డి జడ్పీటీసీ ఇస్మాయిల్,ఎంపీపీ రాజమ్మ,రామస్వామి రెడ్డి,

**పింఛా ప్రాజెక్ట్, అన్నమయ్య ప్రాజెక్టులు పూర్తి చేస్తాం**
**మండల ప్రజల రైతుల సమస్యలు తీరుస్తాం**
**జడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్యే మేడా**



శివారెడ్డి,నల్లతిమ్మాయపల్లి సర్పంచ్ గీతాల నరసింహ రెడ్డి,రామ్మోహన్ నాయుడు, సర్పంచ్ నేతి ఆంజనేయులు,ఎంపీడీఓ రామచంద్ర, కో ఆప్షన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 2000 మందితో టీడీపీ సభ్యత్వానికి రాజీనామా

డోన్ :నంద్యాల జిల్లా డోన్ మండలం వెంకట నాయన పల్లి గ్రామానికి చెందిన శీలం భాస్కర్ నాయుడు అడ్వకేట్, గ్రామ సర్పంచ్ శీలం చంద్రశేఖర్ నాయుడు లు తమ వర్గీయులతో తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజినామ చేస్తున్నట్లుగా శీలం భాస్కర్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ మండలం, వెంకటనాయునిపల్లె గ్రామము నందు నివాసము వుంటు తెలుగుదేశం పార్టీలో సభ్యత్వము పొంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వము నెం.20013243 (2022-2024) తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటు గ్రామ సర్పంచుగా శీలం చంద్రశేఖర్ నాయుడు ని తెలుగుదేశం పార్టీ తరపున అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని గ్రామములోని అన్ని వార్డు మెంబర్లు గెలుచుకోవడం జరిగింది. అయితే డోన్ నియోజక వర్గ ఇంచార్జ్ నియామకంలో అధిష్టానము ఏక పక్షంగా అభ్యర్థిని నియమించడం జరిగిందని. ప్రస్తుతము వున్న ఇంచార్జ్ అభ్యర్థి తమకు తగిన గుర్తింపు ప్రాధాన్యత ఇవ్వడం లేనందని వారు ప్రాథమిక సభ్యత్వానికి రాజినామ చేస్తున్నట్లు తెలిపారు. వారితో పాటు డోన్ నియోజకవర్గములోని బి.సి, యసి, యస్టి, మైనార్టి, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు దాదాపు 2000 మంది సభ్యులు టిడిపి పార్టీ సభ్యత్వానికి రాజీనామ చేయడం జరిగిందని, వారి రాజినామాలను తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు అయిన చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అచ్చన్నాయుడు, నంద్యాల జిల్లా పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అద్యక్షులు గౌరు వెంకట రెడ్డి లకు వారి రాజీనామా పత్రాన్ని పంపడం జరిగిందన్నారు.

# ఆలూరు విలేకరులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



**:-కోసిగి ఏపీయూడబ్ల్యూజే కమిటీ డిమాండ్..**

కోసిగి:- ఆలూరు సూర్య విలేకరి చంద్రమోహన్ ను,ప్రజాశక్తి విలేఖరి కృష్ణా పై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆహడక్ కమిటీ సభ్యులు చాంద్ బాషా, విజయ్ కుమార్,హనుమేష్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కర్నూలు జిల్లా కోసిగిలో ఏపీయూడబ్ల్యూజే అడహక్ కమిటీ ఆదేశాల మేరకు ఏపీయూడబ్ల్యూజే మంత్రాలయం నియోజకవర్గం అడహక్ కమిటీ సభ్యులు శ్రీరాములు,షబ్బీర్ అధ్వర్యంలో స్థానిక కోసిగి తాహ సిల్దార్ కార్యలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ శ్రీరాములుకు అందజేశారు.ఈ సందర్భంగా సీనియర్ విలేకరి విజయకుమార్,కొమ్ము రామన్న,గద్దం ఈరన్న, లు మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆలూరులో మంత్రి ఇలా కలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై సూర్య విలేకరి చంద్ర వార్తా ప్రచురించారు.దీనిని జీర్ణించుకోలేని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అనుచరులు సూర్య విలేకరి చంద్ర పై దాడి చేశారు. విడిపించడానికి ప్రయత్నం చేసిన ప్రజాశక్తి విలేఖరి కృష్ణ పై కూడా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. నిజాయితీగా వార్తలు రాసే విలేకరులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని వారు మండిపడ్డారు.దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం, హోంశాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు గోపాల్,ప్రదీప్ కుమార్, ఈరన్న,కర్రెప్ప,మల్లికార్జున, మహమ్మద్ భాష, యూసుఫ్, నాగార్జున,ప్రవీణ్, ప్రభాకర్, లక్ష్మన్న,రఘు,సతీష్ తదితర పాత్రికేయులు పాల్గొన్నారు..

# ఓటియస్ ద్వారా ఇంటిపై స్వయం ప్రతిపత్తి...



**మండల ఇంచార్జీ మురళీమోహన్ రెడ్డి..**

కోసిగి:- ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వన్ టైమ్ సెంటిమెంట్ (ఓటియస్) ద్వారా పది రూపాయలు మరియు పదివేల రూపాయలు చెల్లిస్తే గత ప్రభుత్వాల్లో మంజూరైన ఇళ్ళకు హక్కు దారులుగా స్వయంప్రతిపత్తి కల్పించడం జరుగుతుందని కోసిగి మండల ఇంచార్జీ మురళీ మోహన్ రెడ్డి అన్నారు.ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో తాహశీల్దార్ రుద్రగౌడ్ అధ్వర్యంలో సర్పంచ్ మంగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఓటియస్ పట్టాల పంపిణీ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా మురళీ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఓటియస్ ద్వారా మంజూరైన పట్టాను బ్యాంకులో తాకట్టు పెట్టి,రుణ మంజూరు అయ్యేలా ఇప్పటికే సియం జగనన్న విధి విధానాలు రూపొందించడం జరిగిందని,ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి,మండల ఇంచార్జీ మురళీ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో 55 మంది పదివేలు, పది రూపాయలు 67 మంది చెల్లించినారని,మొత్తం 112 ఇళ్ళకు డబ్బులు చెల్లించగా, 78 లబ్ధిదారులకు పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో యంపీటీసి సుజాత,మండల కన్వీనర్ బెట్టనగౌడ్, తుమ్మిగనూరు సర్పంచ్ ఈరన్న,జంపాపురం బసిరెడ్డి, బెళగల్లు ప్రశాంత్ రెడ్డి,గ్రామ నాయకులు కురువ చంద్ర, వి.విశ్వనాథ్,కురువ రామన్న, బసవన్న గౌడ్,వి.చంద్రశేఖర్, విశ్వనాథ్ స్వామి,హెచ్.జాన్, మల్లికార్జునస్వామి, హెచ్.గోపాల్,బీమేష్,ఈ.ఉ సేని,పియస్ సోమేష్,వీఆర్వో బాలస్వామి, సచివాలయ సిబ్బంది, వాలింటర్లు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు..

# కోట్ల విజయభాస్కరరెడ్డి గారికి ఘన నివాళి



**:- వై. నాగేశ్వరరావు యాదవ్, తెలుదేశం పార్టీ బీసీ సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్**

కర్నూలు :మాజీ ముఖ్యమంత్రివర్యులు కీ.శే.కోట్ల విజయ భాస్కర రెడ్డి వర్ధంతి సంధర్భంగా వై.నాగేశ్వరరావు యాదవ్ కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు శ్రీ సోమిశెట్టి వెంకటేశ్వర్లు గారు తెలుగుదేశంపార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి తో కలిసి కోట్ల ఘాట్ కు చేరుకొని నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ ఇంచార్జి ఆకెపోగు ప్రభాకర్, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూపర్ స్టైలిష్ లుక్ తో మహానటి


కీర్తి సురేష్ అంటే మొన్నటి వరకు మహానటి సినిమా గుర్తుకు వచ్చేది. ఆ ఇమేజ్ నుండి మెల్ల మెల్లగా కీర్తి సురేష్ బయటకు వస్తుంది. మహానటి పాత్ర



లో అంతగా ఒదిగి పోయిన కీర్తి సురేష్ ఏ సినిమా చేసినా కూడా ఆ సినిమా తో పోల్చి చూస్తూ కామెంట్స్ చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఇప్పుడిప్పుడే కీర్తి సురేష్ మహానటి ఇమేజ్ నుండి బయటకు వస్తున్నట్లుగా అనిపిస్తుంది.ఇటీవల మహేష్ బాబుకు జోడీగా నటించిన సర్కారు వారి పాట సినిమాలో అందాల ఆరబోత చేసింది. అంతే కాకుండా రెగ్యులర్ కమర్షియల్ హీరోయిన్స్ కు ఏమాత్రం తగ్గకుండా ఈ అమ్మడి యొక్క లుక్ మరియు పాత్ర ఉందంటూ కామెంట్స్ వచ్చాయి. ముందు ముందు అలాంటి పాత్రలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లుగా కీర్తి సురేష్ తాజా ఫోటో షూట్స్ తో కూడా చెప్పకనే చెబుతోంది.తాజాగా కీర్తి సురేష్ షేర్ చేసిన ఈ ఫోటో వైరల్ అవుతోంది. ఇతర హీరోయిన్స్ స్కిన్ షో చేస్తే.. అంతకు మించి అన్నట్లుగా ఎక్స్ పోజింగ్ చేస్తేనే వైరల్ అవుతారు. కానీ కీర్తి సురేష్ ఇలాంటి ఫోటోలు కూడా వైరల్ అవుతూ ఉంటాయి. కీర్తి సురేష్ సోషల్ మీడియాలో తాజాగా షేర్ చేసిన ఈ ఫోటో గురించి అభిమానులు తెగ చర్చించుకుంటూ కామెంట్స్ చేస్తున్నారు.ఈ అమ్మడు సూపర్ స్టైలిష్ లుక్ లో ఆకట్టుకుంటుందంటూ అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. సింపుల్ అండ్ స్వీట్ క్యూటీ కీర్తి సురేష్ అంటూ అభిమానులు పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. ఇక ఈ అమ్మడి సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతానికి తెలుగు లో సినిమాలు చర్చలు జరుగుతున్నాయి. తమిళంలో రెండు సినిమాలు చేస్తోంది. హిందీ నుండి కూడా ఆఫర్లు వస్తున్నట్లుగా తెలుస్తోంది.

# ఆ రెండు సినిమాల రికార్డులు మణి సర్ డ్రీమ్ ప్రాజెక్ట్ టార్గెట్

తమిళ్ బాహుబలి అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న పొన్నియిన్ సెల్వన్ విడుదలకు మరి కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ వారంలోనే విడుదల కాబోతున్న ఈ మణిరత్నం డ్రీమ్ ప్రాజెక్ట్ వసూళ్ల గురించి ప్రస్తుతం అంతటా చర్చ జరుగుతోంది. తెలుగు తెలుగు సినిమాలు ఒక కన్నడ సినిమా వెయ్యి కోట్ల మార్క్ ను క్రాస్ చేయడంతో తమిళం నుండి ఈ సినిమా ఆ మార్క్ ను క్రాస్ చేయబోతున్న మొదటి సినిమా అంటూ అక్కడి మీడియా తెగ






ప్రచారం చేస్తోంది.ఇతర భాషల మీడియా మాత్రం పొన్నియన్ సెల్వన్ ని పెద్దగా పట్టించుకోవడం లేదు. మొదట తమిళంలో రికార్డులు సృష్టించిన రజినీకాంత్.. శంకర్ ల 2.0 మరియు కమల్ హాసన్.. లోకేష్ కనగరాజ్ యొక్క విక్రమ్ సినిమా రికార్డులను బ్రేక్ చేయడమే గొప్ప విషయం అన్నట్లుగా కొందరు కామెంట్స్ చేస్తున్నారు. తమిళనాట విక్రమ్ సినిమా ఆల్ టైమ్ ఇండస్ట్రీ రికార్డు సాధించిన విషయం తెల్సిందే.తమిళనాట అత్యధిక వసూళ్లు నమోదు చేసిన విక్రమ్ రికార్డును పొన్నియన్ సెల్వన్ బ్రేక్ చేస్తే చేయవచ్చు.. కానీ ప్రపంచ వ్యాప్తంగా 2.0 సినిమా సాధించిన వసూళ్లను మాత్రం పొన్నియన్ సెల్వన్ బ్రేక్ చేయడం అసాధ్యం అంటూ తమిళేతర మీడియా వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ ఆ రికార్డును బ్రేక్ చేస్తే అప్పుడు వెయ్యి కోట్ల వసూళ్ల గురించి ఆలోచించాలంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.విక్రమ్.. కార్తీ.. ఐశ్వర్య రాయ్.. త్రిష.. జయం రవి ఇలా ఎంతో మంది స్టార్ కాస్ట్ ఉన్న ఈ సినిమా తమిళనాట విపరీతమైన క్రేజ్ ను దక్కించుకుంది. అందుకే ఇప్పటికే అక్కడ ప్రీ రిలీజ్ బిజినెస్ ఆల్ టైమ్ రికార్డు ను నమోదు చేసినట్లుగా చెబుతున్నారు.ఇక సినిమాకు మినిమంగా పాజిటివ్ టాక్ వస్తే అక్కడ రికార్డులు బ్రేక్ అవ్వడం ఖాయం. కానీ వెయ్యి కోట్ల క్లబ్ లో జాయిన్ అవ్వాలి అంటే మాత్రం అద్భుతం అన్నట్లుగా నిలవాలి... సూపర్ డూపర్ సక్సెస్ అవ్వాలి. మరి ఆ స్థాయిలో మణి సర్ పొన్నియన్ సెల్వన్ విజయాన్ని సొంతం చేసుకుంటుందా అనేది చూడాలి.

# 'ఏజెంట్' బ్యూటీకి రామ్ లైన్ క్లియర్!



అఖిల్ అక్కినేని హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ఏజెంట్ సినిమాలో హీరోయిన్ గా సాక్షి వైద్య హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. మోడల్ అయిన సాక్షి వైద్య కి ఏజెంట్ సినిమా తర్వాత తెలుగు లో వరుసగా ఆఫర్లు వస్తాయంటూ ఆ మధ్య ఒకానొక సందర్భంగా అఖిల్ మరియు సురేందర్ రెడ్డిలు అభిప్రాయం వ్యక్తం చేశారు.ఏజెంట్ సినిమా షూటింగ్ ఆలస్యం అయ్యి విడుదల ఆలస్యం అవుతున్నా కూడా సాక్షి వైద్య కి తెలుగు లో రెండవ ఆఫర్ దక్కింది. తాజాగా ఈ అమ్మడు ఎనర్జిటిక్ స్టార్ రామ్ కి జోడీగా బోయపాటి సినిమాలో ఎంపిక అయ్యిందంటూ సినీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఇటీవలే బోయపాటి నిర్వహించిన లుక్ టెస్ట్ మరియు ఇతర టెస్ట్ లో సాక్షి వైద్య సక్సెస్ అయ్యిందట.గతంలో ఉప్పెన విడుదలకు ముందే కృతి శెట్టిని రామ్ తన సినిమాలో ఎంపిక చేశాడు. ఆమె కి ఉప్పెన తర్వాత మంచి పేరు వచ్చింది.. ఆ పేరుతో రామ్ సినిమాకి కూడా మంచి క్రేజ్ దక్కింది. కానీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పర్చింది. అయినా కూడా జనాలకు కృతి శెట్టి వల్ల సాధ్యం అయినంత వరకు సినిమా చేరువ అయ్యింది అనడంలో సందేహం లేదు.ఇప్పుడు రామ్ కి జోడీగా సాక్షి వైద్య నటించబోతుంది. ఆమె ఏజెంట్ సినిమా విడుదల కాకుండానే రామ్ తో నటించేందుకు లైన్ క్లీయర్ అయ్యింది. ముందు ముందు ఈ రెండు సినిమాలతో సాక్షి కి తెలుగు లో వరుసగా ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.సోషల్ మీడియాలో సాక్షి వైద్య ఫోటోలు అప్పుడే వైరల్ అవుతున్నాయి. ఇంకాస్త డోస్ పెంచి ఇన్ స్టా లో సందడి చేస్తే తప్పకుండా సాక్షి వైద్య కు రెండు మూడు సినిమాల్లో అయినా ఆఫర్లు వచ్చే అవకాశం ఉందంటూ అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# జీరో గ్రావిటీలో ఫుట్‌బాల్ మ్యాచ్.. గింగిరాలు తిరుగుతూ గోల్ కొట్టిన దిగ్గజం



జీరో గ్రావిటీలో ఉన్నామంటే గాలిలో తేలియాడడం తప్ప ఇంకేం పని చేయలేం. కానీ అదే జీరో గ్రావిటీలో ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడి చూపించి గిన్నిస్ రికార్డులకెక్కారు ఏడుగురు ఫుట్‌బాల్ ఆటగాళ్లు.ఈ మ్యాచ్‌లో పోర్చుగీస్ ఫుట్‌బాల్ దిగ్గజం లూయిస్ ఫిగోతో పాటు మిడిల్‌ఈస్ట్, యూరోప్, లాటిన్ అమెరికాలకు చెందిన మహిళా, పురుషుల ఫుట్‌బాలర్స్ పాల్గొన్నారు. రెడ్ టీమ్‌కు ఫిగో నాయకత్వం వహించగా.. టీమ్ ఎల్లోకు మరొకరు కెప్టెన్సీ వహించారు.కాగా వీరిని ప్రత్యేక విమానంలో సముద్ర మట్టానికి 6,166 మీటర్ల ఎత్తుకు పంపించారు. జీరో గ్రావిటీలోకి వెళ్లాకా విమానం లోపల ఏర్పాటు చేసిన 75 స్క్వేర్ మీటర్ల పిచ్‌పై మ్యాచ్ ఆడారు. కాగా మ్యాచ్‌లో పోర్చుగీస్ దిగ్గజం

లూయిస్ ఫిగో కొట్టిన గోల్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎన్నిసార్లు గోల్‌పోస్ట్‌పై దాడి చేసినా ఫిగో గోల్ కొట్టలేకపోయాడు. అయితే జీరో గ్రావిటీ కావడంతో సైకిల్ తొక్కుతున్నట్లుగా గాల్లో తిరిగిన ఫిగో బంతిని ఎట్టకేలకు గోల్‌పోస్ట్‌కు తరలించాడు. కాగా ఔట్ ఆఫ్ వరల్డ్ పేరిట నిర్వహించిన మ్యాచ్‌లో రెడ్ టీమ్ 2-1 తేడాతో టీమ్ ఎల్లోపై విజయం సాధించింది. కాగా జీరో గ్రావిటీలో తొలిసారి ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడి గిన్నిస్ రికార్డులోనూ స్థానం సంపాదించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**